ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 20 ఆగస్టు , 2025 | పేజీలు : 06


వివరాలు మెయిన్‌లో

సాగర్ ప్రాజెక్టుకు పోటెత్తుతున్న వరద

# పిహెచ్‌సిలో మౌలిక వసతులు

## నాంపల్లి పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులను కల్పిస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.మంగళవారం ఆమె నాంపల్లి పిహెచ్‌సిని ఆకస్మీకంగా తనిఖీ చేసి ఓపి,ఏఎన్‌సి కేసులు,డ్రగ్స్ తదితర రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఈ నెల నిర్వహించిన ప్రసవాల గురించి అడుగగా2 ప్రసవాలు నిర్వహించినట్లు పిహెచ్‌సి డాక్టర్ భవాని కలెక్టర్ కు తెలిపారు. రోగులు వారి సహాయకులకు కల్పిస్తున్న ఆరోగ్య విద్య ,పౌష్టికాహారం,తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.పి హెచ్ సి కి సమావేశ మందిరం కావాలని కోరగా 10 లక్షల రూపాయలను మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు.ఆసుపత్రిలో నాటిన మొక్కలను పరిశీలించారు.అనంతరం జిల్లా కలెక్టర్ తెలంగాణ మోడల్ స్కూల్,జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు.పాఠశాలలో పరిశుభ్రత,వంటగది,డైనింగ్ క్లాస్ రూమ్స్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాసామర్థ్యాలు పరిశీలించారు.పాఠశాలకు కిచెన్ కావాలని కోరగా మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.కాగా ఈ పాఠశాలకు డైనింగ్ ఇదివరకే మంజూరు చేసిన విషయం తెలిసిందే.చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి,పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ భవాని, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్,తదితరులు ఉన్నారు.



### ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి

గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా జిల్లాలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ లు కోరారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ముందుగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరుగకుండా చూదాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మండపాల నిర్వాహకులు ముందే విగ్రహాల కొలతలతో సహా పోలీస్ కు సమాచారం ఇవ్వాలని, ప్రతి శాఖ రోడ్ మ్యాప్ తయారు చేసుకోవాలని, పర్యావరణహిత మట్టి విగ్రహాలు వాడే విధంగా చూడాలన్నారు. శాంతియుత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించేలా చూడాల్సిందిగా కోరారు.జిల్లా ఎస్‌పి శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ ప్రతి విగ్రహాన్ని పోలీసుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని,మండపాల వద్ద రాత్రి సమయంలో ఒకరు తప్పనిసరిగా ఉండాల్సిన ఉండేలా చూడాలని, పోలీస్ తరపున గట్టి బందోబస్తుతో పాటు ,పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఆఫీజ్ ఖాన్ మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఏసిపి మౌనిక, ఆర్డీవో లు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ ,శాంతి కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్, డాక్టర్ ఏఏ ఖాన్, నేతిరఘుపతి, సలీం ,నాగం వర్షిత్ రెడ్డి, షౌరయ్య, లక్ష్మయ్య హాజరయ్యారు.





వివరాలు మెయిన్‌లో

### 15 బేస్‌మెంట్ లేవల్ ఇండ్లకు బిల్లులు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


వివరాలు మెయిన్‌లో

### ఉత్తరప్రదేశ్‌లో మరో 'బుద్ధవనం'..

# టెన్త్ విద్యార్థులు కష్టపడి చదవాలి

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** విద్యార్థులు పదవ తరగతిలోనే తాము భవిష్యత్తులో ఏమి అవ్వాలో నిర్ణయించుకొని ఆ దిశగా బాగా కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ విద్యార్థులకు సూచించారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించి పదవ తరగతి విద్యార్థులచే తెలుగు, ఇంగ్లీషు పాఠాలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి భవిష్యత్‌కి మొదటి అడుగు అని వార్షిక పరీక్షలకి 7 నెలలు మాత్రమే ఉందని శ్రద్ధపెట్టి కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులు భావి భారత పౌరులని, దేశభవిష్యత్తు మీ మీదనే ఆధారపడి ఉందని, సమాజంలో గొప్ప స్థానం పొందాలంటే అది చదువు ద్వారానే సాధ్యమవుతుందన్నారు. తల్లిదండ్రులు మిమ్మల్ని కష్టపడి పాఠశాలకు పంపుతున్నారని మీరు బాధ్యతగా కష్టపడి మీ కోరికలు సాకారమయ్యేలా చదివి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు పొందాలని కోరారు. ఇప్పుడు కష్టపడితేనే భవిష్యత్తు అంతా సంతోషంగా జీవించవచ్చని ఇప్పుడున్న సాంకేతిక యుగంలో బాగా కష్టపడి చదివితేనే అవకాశాలు అందుబుచ్చుకోవచ్చని తెలిపారు.

**భూభారతి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి...** భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన భూభారతి అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంపై తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి అర్జీలను పరిశీలించారు. ప్రతి అర్జీని రికార్డుల ప్రకారం తనిఖీ చేసి ఎందుకు ఆమోదిస్తున్నారు, ఎందుకు తిరస్కరణ చేస్తున్నారో తప్పనిసరిగా సూచించాలని ఆదేశించా రు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు లాంటి వాటికి సంబంధించిన దరఖాస్తులు మూడు రోజుల్లోనే పూర్తి చేయాలని అదేవిధంగా సర్టిఫికెట్లకు ఒక రిజిష్టర్ నిర్వహిస్తూ దానిలో రోజుకి ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయో, వాటిలో ఎన్ని ఆమోదిస్తున్నారు, ఎన్ని తిరస్కరిస్తున్నారో రాయాలన్నారు.

**ఆరోగ్య కేంద్రం తనిఖీ...** గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. స్టాఫ్ అటెండెన్స్ వివరాలు, ఏఎన్‌సి, ఈడిడి వివరాలు, సీజనల్ వ్యాధుల గురించి డాక్టర్ నరేష్‌ని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైన డెంగ్యూ కేసులు గుర్తిస్తే అక్కడ శానిటేషన్ పనులు వెంటనే చేయాలని ఎంపిడిఓను ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ కవిత, ఎంపిడిఓ సరోజ, మెడికల్ అధికారి నరేష్, ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ తబ్రిద్, ఆర్‌ఐలు ప్రవీణ్, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



## అవార్డు ప్రదానం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రపంచ 186వ ఫోటోగ్రఫీ దినోత్సవం 2025ను పురస్కరించుకొని ఐ అండ్ పిఆర్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ కాంపిటీషన్ నిర్వహించారు. హైదరాబాదులో గ్రీన్ పార్క్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 744 ఫోటోలు పోటీ పడ్డాయి. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన మాదగోని వెంకటేష్ గౌడ్ (తేజ) తీసిన చేయూత పెన్షన్ పథకం ఫోటోకు 5000 నగదు బహుమతి లభించింది. అవార్డును తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు, ఐఏఎస్, సిహెచ్ ప్రియాంక ఐఏఎస్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు.

## అసిస్మెంట్ శిబిరం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని భవిత కేంద్రంలో వివిధ రకాల వైకల్యాలు కలిగిన 18 సంవత్సరాలలోపు వారికి డివిజన్ స్థాయిలో ఉపకరణాలు అందించడానికి మంగళవారం అసిస్మెంట్ శిబిరం నిర్వహించడం జరిగిందని కోఆర్డినేటర్ కత్తుల రవీందర్ అన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి సహాయ ఉపకరణాల కోసం వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంఈవో బాలు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

## నానో యూరియాతో రైతులు అధిక దిగుబడులు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని దత్తాయిపల్లి రైతు వేదికలో నానో యూరియాపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ జెస్సి, తిరుమల రావు నానో యూరియా ఉపయోగాలు, వాడుకునే పద్ధతిపై అవగాహన కల్పించారు. నానో యూరియా 500ml ఒక ఎకరాకు పై పాటుగా వేసుకోవాలని, నానో యూరియా వాడటం ద్వారా రసాయన ఎరువులు వాడుకోవటం తగ్గించి, రైతులకు ఆదాయం పెంచుతుందని తెలిపారు. పర్యావరణం పరి రక్షణకు తోడ్పడుతూ అధిక దిగుబడి పొందుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.నరేందర్ రెడ్డి, ఏ.శ్రీనివాస్ రెడ్డి, భగవంతు, ఇస్తారీ, స్వామి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/ సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధనలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి లింగయ్య లు అన్నారు. మంగళవారం టియు జెఏసి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల జెఏసి జిల్లా అధ్యక్షుడు కోటి సైదులు యాదవ్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ఉద్యమ సాధనలో కేసులకు, పోలీసు తూటాలకు భయపడకుండా రాష్ట్ర ఏర్పాటు సాధనే ధ్యేయంగా ఉద్యమంలో పాల్గొన్నామని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల ఇండ్ల స్థలం, నాలుగు గదుల ఇండ్ల నిర్మాణం, 30వేల పెన్షన్ సౌకర్యం కల్పించి ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందే తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేని పక్షంలో మరో ఉద్యమానికి శ్రీకారం చూడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చంద్రన్నప్రసాద్, క్రిస్టఫర్, లావణ్య, అంజలి కుమారి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

## షీటీమ్ బృందాలతోనే మహిళలకు రక్షణ



**ప్రజాపక్షం/కోదాడ:** మహిళలకు షీటీమ్‌తోనే రక్షణ ఉంటుందని, విద్యార్థులు బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ కవిత అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు, యువత బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల మాయలో పడి తమ భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచిగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. మేసేజ్‌ల రూపంలోగాని, అసభ్యకరమైన పదజాలంతో దూషించడం గాని, ఫోన్‌లు చేసి మహిళల ఆత్మగౌరవాన్ని ఇబ్బంది కలిగించే విధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని సూచించారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మార్కేండేయ, కానిస్టేబుళ్లు సాయి జ్యోతి, నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోదాడ క్లస్టర్ ఉద్యాన విస్తరణాధికారిగా ముత్యంరాజు



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** కోదాడ క్లస్టర్ ఉద్యాన విస్తరణాధికారిగా రంగు ముత్యంరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ క్లస్టర్ పరిధిలోని కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాల్లో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ఉద్యానశాఖ ద్వారా అందించే రుణాలను పొందేందుకు రైతులు సంప్రదించాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా పండ్ల తోటల పెంపకం, కూరగాయల సాగు, ఆయిల్‌ఫామ్ సాగు, పూలతోటల సాగు, తుంపర బిందు సేద్యం పరికరాలకు రాయితీలు అందజేస్తున్నామన్నారు. మామిడి తోటలు సాగు చేసే రైతులు పాత తోటల పునరుద్ధరణ పథకంలో భాగంగా కొమ్మ కత్తరింపులకు ప్రభుత్వం ద్వారా ఎకరానికి 9600 రూపాయిలు రాయితీగా అందజేస్తున్నామన్నారు. మామిడి తోటలో కొమ్మ కత్తిరింపులు చేసే రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉద్యాన పంటల సాగుకు సూచనలు, సలహాలు, రాయితీ కోసం ఆయా మండలాల రైతులు 86390 89839 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# దండు మల్కాపురం జెడ్‌పిహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ భావనకు డాక్టరేట్



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అనలూరి భావన డాక్టరేట్ సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన 84వ స్నాతకోత్సవంలో ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ వి.నారాయణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్‌ల చేతులమీదుగా ఆమె డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. భావన హైదరాబాదులోని ప్రభుత్వ కళాశాలలో బీపీఈడి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంపీఈడీ పూర్తి చేసి 2000 సంవత్సరంలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగంలో చేరి తన ఉద్యోగ జీవితంలో ఇప్పటివరకు 50 మంది హై స్కూలు విద్యార్థులను జాతీయస్థాయి, మరో వంద మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. తాను సైతం జాతీయస్థాయి క్రీడా పోటీల్లో, జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని తన ప్రతిభను ప్రదర్శించారు.



## ఓట్లు, సంపద చోరీ :జూలకంటి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశంలో ఉన్న సంపదను కార్పోరేట్లు, ఓట్లను పాలకులు చోరీకి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను కొంతమంది చేతుల్లోకి వెళ్తుండడంతో పేదలు మరింత పేదలుగా మారుతున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీహార్‌లో తప్పుడు మార్గంలో అధికారంలోకి రావడానికి సుమారు 65లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. తెలంగాణాలో యూరియా లేకుండా రైతులకు సరిపడా ఎరవులను అందించాలని ఆయన కోరారు. సాగర్ జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నందున చివరి భూముల వరకు నీరందించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్చంద్ర, గౌతంరెడ్డి, పాండు, రవినాయక్, శశిధర్‌రెడ్డి, పరుశురాములు, రామ్మూర్తి, కరీం తదితరులు ఉన్నారు.

## ఎత్తైన గణేష్ విగ్రహాలు తరలించే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఎత్తైన గణేష్ విగ్రహాలు తరలించే సమయంలో కరెంటు తీగల నుండి జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పి కె నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎత్తైన గణేష్ విగ్రహం పెడుతున్నామనే ఉత్సాహం విషాదం కావొద్దని, అశ్రద్ధగా ఉండొద్దన్నారు. గతములో కరెంటు తీగలు తగిలి ప్రమాదాలు సంభవించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ఎవ్వరూ ప్రమాదాల బారినపడవద్దు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ఉత్సవం సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఎత్తై విగ్రహాలను తరలించే విషయాన్ని స్థానిక పోలీసులకు, ఎలక్ట్రిసిటి అధికారులకు తెలిజేయాలని తద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత సమన్వయంగా ఉండాలని అతి ఉత్సాహం చూపొద్దని, గొడవలు పెట్టుకోవద్దని హెచ్చరించారు.

## దుండగులను శిక్షించాలి



**ప్రజాపక్షం/ తుంగతుర్తి :** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో భారత స్వాతంత్రోద్యమ సారథి, జాతిపిత, అహింసావాది మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండుగులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపిపి, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు ఈగ నాగన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి, అహింసతో భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన జాతిపిత విగ్రహం ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. నాయకులు బండారు దయాకర్, తల్లాడ కేదారి, ఓరుగంటి శ్రీనివాస్, ఓరుగంటి అశోక్, గుండ శ్రీనివాస్, గుమ్మడవెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణం తనిఖీ



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** యూరియా అమ్మకాలు సక్రమంగా జరపాలని, ఎక్కువ రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భం గా దుకాణంలోని ఎరువుల స్టాక్ రిజిస్టార్‌ను పరిశీలించారు. ఎరువుల విక్రయాలు ఈపాస్ యంత్రం ద్వారా మాత్రమే జరగాలని, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్స్ సరిగా చూసుకోవాలని అదేశించారు. మండల వ్యవసా య అధికారి పాలెం రజిని, ఎరువుల డీలర్స్, ఎఇవోలు పాల్గొన్నారు.




# యువత చెడు అలవాట్లకు బానిస కావొద్దు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యువత చెడు అలవాట్లకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఏఎస్ఐ నందిపాటి ప్రభాకర్, హెచ్‌జీ రవీందర్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని అభ్యాస్ ఉన్నత పాఠశాలలో ఎస్‌పీ శరత్‌చంద్రపవార్ ఆదేశానుసారం షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించి వారు మాట్లాడారు. విద్యార్థినిల, మహిళల పట్ల ప్రతి ఒక్కరు గౌరవంతో ఉండాలని, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత డ్రగ్స్, గంజాయి బారిన పడకుండా బుద్ధిగా చదువుకోని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్అదాలత్



**ప్రజాపక్షం/ రామన్నపేట:** సెప్టెంబర్ 13న జాతీయ లోక్అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత అన్నారు. మంగళవారం రామన్నపేట కోర్టులో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది పనిచేయాలన్నారు. లోక్అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు ఎన్.వెంకటేశ్వర్లు, వెంకటేష్, ఎస్ఐలు నాగరాజు, యుగేందర్ గౌడ్, వెంకట్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి సెలక్షన్ నిర్వహించాలని ఎంఈవో గవ్వ జ్యోతి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడలను ఈనెల 23న బాలికలకు, 25న బాలురలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మైదానంలో నిర్వహించి మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో పీడీలు పెద్దబోయిన మణి, రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలన

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని సిరిపురం, సర్నేనిగూడెం గ్రామాల్లో నిర్మితమవుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో రాములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, సుధ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామపంచాయతీ శివారులో గల భువనగిరి గజ్వేల్ 65 జాతీయ ప్రధాన రహదారి రోడ్డులో మూలమలుపు వద్ద వర్షపు నీటితో గుంతలు ఏర్పడి నీరు నిండి ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు పెద్ద పెద్ద అతి భారీ వాహనాలు ప్రయాణించే రహదారిలో రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పల్లెపహాడ్ స్టేజ్, వాసాలమర్రి, తిర్మలాపురం గ్రామాల వద్ద కల్వర్టుల పై నిర్మించిన రక్షణ గోడల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరమైన మూలమలుపు, రోడ్డు పై ఏర్పడ్డ గుంతలు మరమ్మతులు చేపించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన భోధన అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి మున్సిపల్ పరిధిలోని రాయగిరిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లడుతూ భారీగా వర్షాలు పడుతున్నందున విద్యార్థులు జాగ్రతగా ఉండాలని సూచించారు. విద్యార్థులు కరెంట్ స్తంభాల వద్దకు గాని వెళ్లవద్దన్నారు. మీ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లు ఉంటే విద్యార్థులు టీచర్లకు తెలియజేయాలని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉంచకుండా గ్రామాల్లో ఉన్న గ్రామపంచాయతీలోకి పంపాలన్నారు. విద్యార్థులను మీ గ్రామంలో అతి పేదవారు, ఇల్లు లేని వాళ్ళు ఉన్నట్లయితే మీయొక్క టీచర్స్‌కి తెలియజేయలన్నారు. అలాంటి వారికి ఇందిరమ్మ ఇళ్ళను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్‌ఎం హరినాథ్ రెడ్డి, ప్రభాకర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కుమ్మర్లు రాజకీయంగా చైతన్యం కావాలి



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** తెలంగాణ రాష్ట్రంలో 14 లక్షల జనాభా ఉన్న కుమ్మర్లకు నేటికీ చట్టసభలలో ప్రాతినిధ్యం లేకపోవడం కుమ్మర్లు ఆర్థికంగా రాజకీయంగా చైతన్యం లేకపోవడమే కారణమని బొమ్మలరామారం మండల కుమ్మరి సంఘం అధ్యక్షులు బేతాళ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో జరిగిన కుమ్మర్ల విస్తృత మండల స్థాయి సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడిగా బేతాళ శ్రీనివాసులును ప్రధాన కార్యదర్శిగా బేతాళ బాలరాజు తోపాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మలరామారం మండలంలోని అన్ని గ్రామాల నుంచి హాజరైన కుమ్మరి సోదరులు భవిష్యత్తులో కుమ్మరులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి చట్టసభలలో అవకాశం కల్పించే పార్టీకే కుమ్మరులంతా ఐక్యంగా నిలవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో బేతాళ శ్రీనివాసులు మాట్లాడుతూ కుమ్మరి సోదరుల సహకారంతో మండల కేంద్రంలో కుమ్మరి సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ ఓరుగంటి గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు తాడూరి ఆంజనేయులు, చిన్నగారి బలరాం దొమ్మాట మల్లేష్, తాడూరి లక్ష్మణ్‌తో పాటు బొమ్మలరామారం మండల గౌరవ సభ్యులు బోనంకుర మల్లేశం, బేతాళ బాలనరసింహ పాల్గొన్నారు.

# పూటకో కండువా, రోజుకోపార్టీ మారే నాయకుల్లారా ఖబడ్దార్..



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాసమల్ల యాదయ్య చిలివేరు నరసింహ, వీరమల్ల నరసింహ, శ్రీ రామోజు హరికుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉప ఎన్నికలలో మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి ప్రయత్నం చేసిన వారంతా మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరి పూటకో కండువా, రోజుకో పార్టీ మారి నికార్సైన కాంగ్రెస్ నాయకుడు చల్లమల్ల కృష్ణారెడ్డి పై విమర్శలు చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. ఖబర్దార్.. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దగ్గర చెంచాలుగా చలామణి అవుతూ ఎమ్మెల్యేకు చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తెలిసిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలువేరు జున్ను, బైకని నరేందర్, చెక్క నరసింహ, మినుగు గోపాల్, బిట్టు సత్యనారాయణ, ఎల్లంకి నరేష్, రాజ్ కుమార్, మైలారం రాములు, మల్లికార్జున్ రెడ్డి, వెంకటేశం, రాములు, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్టస్థాయిలో ప్రతిభ కనబరచాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** క్రీడాకారులు ఈనెల 21న జరిగే ఫుట్బాల్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లో తమ ప్రతిభను కనబరిచి విజేతగా నిలవాలని డివైఎస్ఓ అక్బర్ అలీ ఆకాంక్షించారు. మంగళవారం నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలో డిఈఓ బిక్షపతి ఆదేశానుసారం జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ దగ్గుపాటి విమల ఆధ్వర్యంలో బాలుర అండర్17, 15 పుట్ బాల్ జిల్లా టోర్నమెంట్ టీమ్‌ను సెలక్షన్స్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎస్ఓ అక్బర్ అలీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ టోర్నమెంట్లో విజేతలుగా నిలిచిన జట్టు ఈనెల 21న జరిగే శుభ్రత ముఖర్జీ కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణతో క్రీడలలో పాల్గొని మెరుగైన విజయాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిడిలు టి శంభు లింగం, ఎన్ శ్రీకాంత్ రెడ్డి, బొమ్మపాల గిరిబాబు,సైదులు క్రీడాకారులు పాల్గొన్నారు.



# ఎన్‌సిసితో దేశభక్తి వృద్ధి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ఎన్‌సీసీతో యువతలో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం,నాయకత్వ లక్షణాలను కలిగిన ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఎన్‌సీసీ నల్లగొండ కల్నల్ టి.లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు 31టీ బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన నూతన ఎన్‌సీసీ ఎంపిక సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో క్రమశిక్షణతో ఉంటే తమ కలలను సాకారం చేసుకోని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రహత ఖానం, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ రాచమల్ల శ్రీను, మేజర్ మాధవరావు, కొమ్ము మల్లయ్య, సురేష్, అజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం సందర్శన



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలోని రామన్నపేట అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని మంగళవారం యూనివర్సిటీ జేడి ప్రొఫెసర్ ధర్మానాయక్ సందర్శించి మాట్లాడార. యూనివర్సిటీ ప్రస్తుత వీసీ అయిన ఘంటా చక్రపాని యూనివర్సిటీలో వివిధ వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టి దేశంలోనే నెం.1 స్థాయికి తీసుకెళ్లడానికి కృసి చేస్తున్నారని అన్నారు. దేశంలో ఏ యూనివర్సిటీకి లేని కోర్సులు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉన్నాయని, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వాళ్లు, చదువులో మధ్యలో మానేసిన వారు ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పట్టా పొందవచ్చని, అంబేద్కర్ ఓపెన్ డిగ్రీకి రెగ్యులర్ డిగ్రీతో సమానంగా విలువ ఉందన్నారు. ఎంతో మంది ఓపెన్ డిగ్రీ చేసిన తరువాత ఐఏఎస్, ఏపీఎస్ వంటి కొలువులు సాధించారని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహతఖానం అధక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ చిన్నబాబు, అధ్యాపకులు వెంకటేశ్వర్‌రావు, అధ్యయన కేంద్ర కౌన్సిలర్లు అమర్, ప్రశాంత్, నరేష్, ఆంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# 'నానో' ఎరువులతో అధిక దిగుబడులు : శాంతి నిర్మల

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** రైతులు నానో ద్రవరూప యూరియా, డిఏపి వాడడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని యాదగిరిగుట్ట వ్యవసాయ సహాయ సంచాలకులు శాంతి నిర్మల అన్నారు. ఆమె బుధవారం మండలంలోని మాటూరులో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ నానో యూరియా మొక్కలలో పచ్చదనం, చురుకైన పెరుగుదల, పంట అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. 50 కిలోల యూరియా బస్తా ధర రూ.266, ఉండగా నానో యూరియా 500 మిల్లి మీటర్ల బాటిల్ రూ.225లకు లభిస్తుంది, డిఏ పి బస్తా రూ.1400 ఉంటే నానో లీటర్ బాటిల్ రూ.600లకు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమాదేవి, ఏఈఓలు సంధ్య, శివాని, సురేష్, వెంకటేష్, రైతులు వాకిటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి మల్లారెడ్డి, పేరబోయిన సిద్ధులు, పేరబోయిన ఐలయ్య, జల్తారు రాజు, వాకిటి మాధవరెడ్డి, వాకిటి సిద్ధిరాంరెడ్డి పాల్గొన్నారు.





## ఘనంగా బోనాల పండుగ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** శ్రావ ణ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని 13వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి వద్దకు చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించి తమ కుటుంబాలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకొని మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి, యాదమ్మ, కాసాని రాజు ,వెంకటాచారి, సుదర్శన్, అన్నపూర్ణ పద్మ,సాయి,అజయ్, వసంత, కార్తీక్, పుష్ప,రాము జానకి రాములు, వీరేశం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నోట్ బుక్స్, పెన్సిల్స్ పంపిణీ



**ప్రజాపక్షం/నందికొండ:** స్థానిక మున్సిపాలిటీ హిల్ కాలనీ బాలవిహార్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మహారాజుల సేవా సంఘం ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహారాజుల సంఘం సభ్యులు మాట్లాడుతూ విద్య ఎంతో విలువైనదని విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు వెంకన్న, ప్రసాద్ రావు, సతీష్, నరసింహారావు, మహారాజుల సేవా సంఘం అధ్యక్షుడు జి బద్రి, ఉపాధ్యక్షులు కే పుల్లారావు, కార్యదర్శి ఆర్ వీరబాబు, కోశాధికారి కె నకులరావు సభ్యులు దుర్గయ్య పాల్గొన్నారు.

## మహా రుద్రాభిషేకం

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** ఆరుద్ర నక్షత్రం ను పురస్కరించుకొని శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామికి మహాన్యాసక పూర్వక ఏకాదశ మహా రుద్రాభిషేకము ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలం పరిధిలోని గోపలాయిపల్లి శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానం లో కొలువై ఉన్న శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి కి మహాన్యాసక పూర్వక ఏకాదశ మహా రుద్రాభిషేకము ను ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి రాజేశ్వరి దేవి ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ప్రతి మాస శివరాత్రికి శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామిలకు కళ్యాణం జరుపబడునని చైర్మన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధికారి చిట్టెడి వెంకటరెడ్డి, పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

## బేస్‌బాల్‌లో ఘన విజయం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆగస్టు 16,17,18 తేదీలలో ఆదిలాబాద్ జిల్లాలోని ఐబి స్టేడియం లో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ బేస్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో టిజిఎంఆర్ ఎస్‌జెసి నల్లగొండ గర్ల్స్ 1 ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కి చెందిన పి.కీర్తన మెరిట్ మూడవ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ కుతేజుల్ కుబ్ర అధ్యాపకులు, సహ విద్యార్థినులు ఆమె విజయంపై అభినందనలు తెలిపారు.



## ఎపిలో ఉత్తమ ఫోటోగ్రఫిగా చింతలపాలెం గ్రామవాసి



**ప్రజాపక్షం/చింతలపాలెం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని విజయవాడ అర్బన్ నగరంలో ప్రపంచ గిరిజన దినోత్సవం, ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవ వేడుకల్లో తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లా చింతలపాలెం గ్రామ వాసి వనం పాపారావు ప్రపంచ ఉత్తమ ఫోటోగ్రఫి అవార్డు మంగళవారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సృజనాత్మక సంస్కృతి సమితి సౌజన్యం ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫర్ కౌన్సిల్ ఫోటోగ్రఫి అకాడమి ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఎపి టూరిజం డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఎక్కడైనా ప్రజల పరిస్థితులు వారి జీవన విధానం తెలియజేసేది ఫోటోగ్రఫి అన్నారు. ఫోటోగ్రఫి అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ టూరిజం అభివృద్ధి జరగాలంటే ఫోటొగ్రఫి ద్వారా అక్కడ పరిస్థితులు ఆ ప్రాంత గొప్పతనాన్ని ఆకర్షించినప్పుడే జరుగుతుందన్నారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా గిరిజనుల జీవన విధానం కళ్లకు కట్టినట్లు తెలిపిన నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 16 రాష్ట్రాల నుండి 487 ఎంట్రీలు వస్తే 43 మాత్రమే ఎంపికయ్యాయని అన్నారు.సావనీరు విడుదల చేశామన్నారు. 60వేల నగదు మొదటి బహుమతి, ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌తో పాటు గోల్డ్‌మెడల్ బహుకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వనం పాపారావును మండల ప్రజలు అభినందించారు.

## మొక్కలను విరివిగా పెంచాలి : డిఎఫ్‌ఓ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మానవాళికి మేలు చేసే మొక్కలను విరివిగా పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ ఆవరణలో సామాజిక కార్యకర్త సురేష్ గుప్తాతో కలిసి మొక్కలు నాటారు.ఇటీవలి కాలంలో మొక్కలను నాటకపోవడం, అడవులను నాశనం చేయడం తదితర కారణాల వల్ల వాతావరణ అసమతుల్యం ఏర్పడుతుందని, ఇది భవిష్యత్తులో వాతావరణ సమతుల్యానికి అడ్డంకిగా మారుతుందని, ఈ విషయాన్ని అందరూ గుర్తించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్‌డిఓ కార్యాలయంలో మొక్కలు నాటడం, ప్రత్యేకించి కార్యాలయ ఆవరణ మొత్తం మొక్కలు నాటేందుకు పూనుకోవడం పట్ల ఆయన ఆర్‌డిఓ అశోక్ రెడ్డిని అభినందించారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఇలాగే అందరు మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించేందుకు కృషి చేయాలని అన్నారు.

## ముగిసిన మర్రిగూడ బోధనాభ్యాసన సామగ్రి మేళా

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల స్థాయిలో బోధనాభ్యాసన సామాగ్రి,టిఎల్‌ఎం మేళ మర్రిగూడ జిల్లా పరిషత్ పాఠశాల వేదికగా విజయవంతంగా ముగిసింది. మంగళవారం మండల విద్యాధికారి బిట్టు శ్రీనివాస్ అధ్యక్షతన 9 గంటలకు ప్రారంభమై మేళాలో మండలంలోని, 22,పాఠశాలల నుండి ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనను మరింత ఆసక్తి కలిగించే విధంగా నో కాస్ట్, లో కాస్ట్ తోటిఎల్‌ఎం, తయారుచేసి ప్రదర్శించారు. మండల ప్రత్యేక అధికారి బి వేణుగోపాల్ వినూత్నంగా తయారుచేసి టిఎల్‌ఎంన,మేళాను సందర్శించి ఉపాధ్యాయులను ప్రశంసించారు. అన్ని స్టాల్స్ ఆకర్షనీయంగా విద్యార్థులకు ఉపయుక్తంగా ఉన్నప్పటికీ న్యాయ నిర్ణీతలు వాటిలోని 10 పాఠశాల టిఎల్‌ఎంల, ను జిల్లాస్థాయికి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ముగింపు సమావేశంలో జిల్లా స్థాయికి ఎంపిక కాబడిన ఉపాధ్యాయులతోపాటు ప్రతి పాఠశాల ఉపాధ్యాయులను ప్రశంసా పత్రంతో సత్కరించి ఎంఈఓ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కళా శ్రీనివాస్. శారద, మాలతిలకు ఎంఈఓ కృతజ్ఞతలు తెలిపారు. పిఆర్‌టియు మండల అధ్యక్షుడు హల్వాయి వెంకట్ రెడ్డి, యుటిఎఫ్ అధ్యక్షులు శ్రీనివాస్ రావు, టీ పిటిఎల్‌ఎం,యు.ఎస్ అధ్యక్షులు రమణ, ప్రధానోపాధ్యాయులు ఆర్ విటల్ బిక్షమయ్య, అల్వాల్ రెడ్డి, రజనీకాంత్, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## సులభమైన రీతిలో విద్యాబోధన చేయాలి




**ప్రజాపక్షం/ హాలియా:** విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో బోధనోపకరణాల టిఎల్‌ఎం మేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ముగింపు సమావేశంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బోధనోపకణముల ద్వారా విద్యాబోధన విద్యార్థులకు సులభంగా అర్థం కావటానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మండలములోని 29 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన 82 మంది ఉపాధ్యాయులు పాల్గొని 245 బోధన ఉపకరణాలు తయారు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో తోడ్పాటు అందించిన చల్మా రెడ్డిగూడెం కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ప్రకాష్ యాచారం కాంప్లెక్స్ హెడ్మాస్టర్ నాగిరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు పెరుమాళ్ళ వెంకటేశం ,మంచికంటి మధు, కట్ట మధు, చిన్న వెంకటరెడ్డి, రాజశేఖర్, సయ్యద్బియా, రవీందర్ ,ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పెనుగొండ సుబ్బారావు పాల్గొన్నారు.

## గతుకుల రోడ్లతో ప్రమాదాలు..



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:**నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కన ఆర్టీవో కార్యాలయం వెళ్లే మార్గంలో రోడ్డు మధ్యలో గుంట ఏర్పడి అందులో వర్షపు నీరు చేరి ఉండడంతో వచ్చి పోయే వాహనదారులు గుంటలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కలెక్టర్ కార్యాలయం పక్కనే ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్‌టిఓ కార్యాలయానికి తరచుగా వాహనాలు వెళ్లడంతో రోడ్డు ధ్వంసమై గుంటగా ఏర్పడి అందులో వర్షపు నీరు చేరడంతో గుంట కనపడక వచ్చిపోయే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న గుంటను పూడ్చి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఎంపికలు

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల నైపుణ్యాలు పెంచే దిశగా భారత ప్రభుత్వ క్రీడలు,యువజన సర్వీసుల శాఖ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో తమిళ యూనివర్సిటీ తంజావూర్ తమిళనాడు రాష్ట్రంలో సెప్టెంబర్ 18 నుండి 24 వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి2025కు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఎంపికకు సంబంధించిన నల్లగొండలోని ఎంజీయూ పరిధిలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలు ,పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల నుంచి వాలంటీర్ల ఎంపికలు ఆగస్టు 23వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జాతీయ సేవ పథకం సమన్వయకర్త డాక్టర్ పసుపుల మద్దిలేటి తెలిపారు. ఈ ఎంపికలో కమ్యూనికేషన్ స్కిల్స్ , ఇంగ్లీష్, హిందీ నాయకత్వ లక్షణాలు, కల్చరల్ అంశాలలో ప్రతిభ కనపరిచిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన 5బాలురు 5బాలికలు జాతీయ సమైక్యత శిబిరానికి పంపించడం జరుగుతుందన్నారు.

## బిఆర్ఎస్ రైతుధర్నా



**ప్రజాపక్షం/పెద్దఆడిశర్లపల్లి:** రెవెన్యూ సదస్సులో రైతులు ఇచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గుడిపల్లి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పీఏ పల్లి ఉమ్మడి మండల అధ్యక్షుడు ఎల్గూరి వల్లపు రెడ్డి,అంజిరెడ్డిలు మాట్లాడుతూ భూ భారతి చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహణలో వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15లోగా పరిష్కరిస్తామని నేటికి పరిష్కరించలేదన్నారు.గత కెసిఆర్ ప్రభుత్వ హాయంలో భూ సమస్యల పరిష్కారానికై తీసుకువచ్చిన ధరణి సరిగా లేదని పేరును రద్దుచేసి కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చేసిన చట్టం వల్ల ప్రజలకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆరోపించారు.నూతనంగా ఏర్పడిన గుడిపల్లి మండలానికి భూ సమస్యల పరిష్కారం పట్ల అవగాహన లేని తహసిల్దార్ ను నియమించారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు అర్వపల్లి నరసింహ,ఎర్ర యాదగిరి,సుధాకర్ గౌడ్,మహేందర్,పిల్లి వెంకటేశ్వర్లు, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## సంత బస్టాండ్ సమీపంలోకి మార్పు

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీ పట్టణంలోని సెంటర్‌లో ప్రతి శుక్రవారం నిర్వహించనున్న కూరగాయల వారాం తపు సంతను వచ్చే శుక్రవారం నుండి బస్టాండ్ సమీపంలో నిర్వహించుకోవాలని చిరు వ్యాపారులకు మున్సిపల్ కమీషనర్ మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు. చండూరు మెయిన్ రోడ్డు విస్తరణ విస్తరణ పనులు జరుగుతున్నందున రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులకు , రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకం జరుగకుండ ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

# ఫోటోలు, వీడియోలు మధురమైన జ్ఞాపకాలు





**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ఫోటోలు, వీడియోలు మధురమైన జ్ఞాపకాలు అని, ఆ జ్ఞాపకాల వెనుక ఫోటో అండ్ వీడియో గ్రాఫర్‌ల కృషి దాగి ఉంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి అన్నారు. 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం చౌటుప్పల్ మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి గంగాపురం కాటమరాజు గౌడ్, చౌటుప్పల్ మండల అధ్యక్షులు తూర్పునూరి సాయిలు గౌడ్, ప్రధాన కార్యదర్శి సుక్క సామి, సహాయ కార్యదర్శి రోషణ గారి రాఘవేంద్ర గౌడ్, సీనియర్ ఫోటోగ్రాఫర్స్ చింతల గణేష్, మెట్టు రామచంద్రారెడ్డి, భారత మధు, కందగట్ల కృష్ణ, భీమనపల్లి బలరాం, నల్లంకి మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవం సందర్భంగా కోదాడ ఫోటోగ్రాఫర్ ఆధ్వర్యంలో ఫోటో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫి మండల అధ్యక్షులు పిల్లుట్ల వెంకట్ మాట్లాడుతూ ఫోటోగ్రఫి అంటేనే గత తీపి జ్ఞాపకాలను గుర్తు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు మరికంటి లక్ష్మణ్, సాయివంశీ, రాంబాబు, శ్యామలసైదులు, సలిగంటి మురళి, కృష్ణ, విష్ణు, సైదాచారి, పషి, మార్ల శేఖర్‌రెడ్డి, నాగరాజు, నర్సింహరావు, సురేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ 186 ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం నాగార్జునసాగర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్ నాగేశ్వరరావును జానారెడ్డి తన నివాసంలో మాజీ జెడ్పిటిసి లింగారెడ్డి తో కలిసి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నాగార్జునసాగర్ లోని ఫోటోగ్రాఫర్లు ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నాగార్జునసాగర్ డ్యాం పరిసరాలలో కేకును కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్రావు, నరసింహ, నరేందర్, వెంకటేశ్వర్లు, కనకరాజు, శంకర్, శివ నాగులు, అప్పారావు, స్వతంత్ర, సురేషు, శ్రీను, అమ్మోరియా, కోదండం, తాతీలు, రాజు, ప్రసాద్, వెంకటేష్ , ధనరాజ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.







## చంద్రగిరి విలాస్ కాలనీలో ద్వాదశ పుష్కర బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోనీ చంద్రగిరి విలాస్ కాలనీలోఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం ఘనంగా ద్వాదశ పుష్కర బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరసింహ చార్యులు, చక్రి , ఉదయం సుప్రభాత సేవ, నిత్యారాధన సేవా ,కాలం శాంతి పటం, వేద విన్నపం, నిత్య హోమం ,మహా పూర్ణాహుతి, చక్రస్నానం జరిపించారు. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, దేవతోద్వాసన,శ్రీ పుష్పయాగం, మహా కుంభ ప్రోక్షణ అనంతరం కదంబ ప్రసాదం పంపిణీ చేశారు. కాలనీ భక్త బృందం తో పాటు సమీప గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వేముల సాయికుమార్, సభ్యులు రావుల శ్రీనివాస్ జిల్లపల్లి వెంకటేశ్వర్లు, జిల్లపల్లి శ్రీనివాస్, విజయ్ కుమార్ మేడి లింగస్వామి, శ్రీదేవి, ప్రమీల, శిరీష ,కల్పన, ధనలక్ష్మి ,మంజుల, యాదమ్మ, పవిత్ర, రమ ,అంజలి, శ్రీ హర్షిని ,తేజ ,సిటీ తదితరులు పాల్గొన్నారు.

## కొండచిలువను చంపిన గ్రామస్తులు

**ప్రజాపక్షం/ఎర్రవల్లిః** ఎర్రవల్లి మండలం ఆర్‌గా గ్రామంలో కే.భీమ్‌రెడ్డి అనే రైతు కల్లం దొడ్డిలో మంగళవారం కొండచిలువ కనిపించడంతో భయాందోళనకు గురై కొండచిలువను చంపివేశారు.

## ఇసుక సరఫరాలో నయా దందా అరికట్టాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఇసుక సరఫరా కోసం ఆన్లైన్లో బుక్ చేసుకుంటే ఎటువంటి సమాచారం లేకుండా క్యాన్సల్ చేస్తు ఆఫ్లైన్లో ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్నారు అని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ ఆరోపించారు.మంగళవారం డ జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలు ఇల్లు కట్టుకోవడానికి ఇసుక ఆన్లైన్లో బుక్ చేసుకుంటే క్యాన్సల్ అయి రావడం లేదన్నారు. తప్పని పరిస్థితిలో అధిక రేటుకు బయట తీసుకుంటున్నారు. జిల్లాలో మైనింగ్ శాఖ అధికారులు దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొంత ఒత్తిడి చేసి ఆన్లైన్ ద్వారా ఇసుక తెప్పించుకుంటే బూడిద బూడిదగా రాళ్లు వారి ఇంటి నిర్మాణానికి పనికిరాకుండా వస్తున్నది ఆన్లైన్లో ఇసుక ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.2900 ఉండగా ఆఫ్లైన్లో రూ.4వేలువరకు ఖర్చు అవుతుంది.కావున ఇప్పటికైనా కలెక్టర్ గారు స్పందించి ఆన్లైన్లో ప్రజలకు అందు వలన అందుబాటులో ఉండే విధంగా ఇసుక సరఫరా చేసే విధంగా చూడాలి. ప్రజలను ఇబ్బంది పెడుతున్న పట్టించుకోని మైనింగ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లెంల శ్రీకర్, గుండాల నరేష్ జిల్లా సహాయ కార్యదర్శులు కట్ట లింగస్వామి, వడ్డగాని మహేష్, గద్దపాటి సుధాకర్ జిల్లా నాయకులు పోకల శశి పాలాధి కార్తీక్ బొడ్డుపల్లి నరేష్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పైపులైన్ పగిలి పది రోజులు..

### వృథాగాపోతున్న నీరు.. పట్టించుకోని అధికారులు..



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఓ పక్క వర్షంతో గత పది రోజులుగా రోడ్లు మొత్తం జలమయం కాగా... దీనికి తోడు మంచినీటి పైపులైన్ పగిలి పది రోజులుగా నీరు వృథాగా పోతున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. వివరాలలోకి వెళ్తే.. పట్టణంలోని 16వ వార్డు శ్రీ విజయాంజనేయ స్వామి దేవాలయం సమీపంలోని కొత్త కలెక్టరేట్ రోడ్డుకు వెళ్ళే మార్గంలో ఇటీవల అండర్ డ్రైనేజీ కోసం పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ వారు రోడ్డును తొవ్వి పైపులైన్ వేశారు. అదే మార్గంలో ఉన్న మంచినీటి సరఫరా పైపులైన్ వీరి తొవ్వకాలతో ధ్వంసమైంది. అదేచోట మ్యాన్ వాల్ కూడా నిర్మించారు. అక్కడి నుండి నీరు నిరంతరాయంగా వృథాగా పోతుంది. వర్షపునీటికి తోడు మంచినీటి పైపులైన్ పగలడంతో వస్తున్న నీటితో రోడ్డు వరద కాల్వను తలపిస్తుంది. ఈ రహదారిపై వెళ్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కార్లు, జీపులు బురదలో కూరుకుపోతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు నీటి వృథాను అరికట్టి వాహనదారులు, బాటసారులకు ఇబ్బందిలేకుండా చూడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## కాన్వకేషన్ సర్టిఫికెట్ అందుకున్న డా.రవికుమార్



**ప్రజాపక్షం/మానవపాడుః** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గం మానవపాదు మండలం పాలమూరు యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న అలంపూరు నియోజకవర్గం, మానవపాదు మండలం అమరవాయి గ్రామానికి చెందిన డా.రవికుమార్ కు ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ నారాయణ ఉపకులపతి కుమార్ మొల్గరం చేతుల మీదుగా కన్వకేషన్ సర్టిఫికేట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డా.రవికుమార్ ను ప్రత్యేకంగా మానవపాడు మండల ప్రజలు, శ్రేయోభిలాషులు, బంధువులు, పలువురు అభినందించారు.

## పారితోషికాలు వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మర్రిగూడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అరుణతారకు ఆశాల 18 డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ జూలై నెల పారితోషికాలు వెంటనే చెల్లించాలని, నెలనెలా సకాలంలో వేతనాలు ఇవ్వాలని, కనీసం 18 వేల రూపాయల ఫిక్స్ వేతనం కల్పించాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు వేతనాలు ఆలస్యమవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు సల్వోజ్ రామలింగాచారి, ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యకార్యదర్శులు మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, ఏర్పుల పద్మ, పందుల పద్మ, భీమనపల్లి అరుణ, మెండు విజయమ్మ, వారాల శోభ, అందుగుల యాదమ్మ, దామర యాదమ్మ, కె.సునీత, మంజుల, దుర్గమ్మ, సబిత, ఏర్కొండ రాఘవేంద్ర, జాజాల అనిత తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఆన్‌లైన్ దరఖాస్తు

**ప్రజాపక్షం/కోదాడరూరల్:** కోదాడ మండల వ్యాప్తంగా గణేష్ ఉత్సవ కమిటిల నిర్వాహకులు గణేష్ నవరాత్రి ఉత్సవాలకు దరఖాస్తు చేసుకోవాలని కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అనుమతి ప్రక్రియ తొందరగా పూర్తి చేసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా విద్యుత్ ఇతర జాగ్రత్తలు తీసుకోని నిమజ్జనం అయ్యే వరకు మండపాల వద్ద నిర్వాహకులు తప్పని సరిగా ఉండాలన్నారు. మండపాల వద్ద ప్రజలకు ఇబ్బందులు పెట్టే సౌండ్ బాక్స్‌లు ఎక్కువగా వాడకూడదని సూచించారు. నిమజ్జన సమయంలో ఎక్కడ కూడా డిజెలు పెట్టవద్దని అలా పెడితే వారిపై కేసులు నమోదు చేస్తామని, పండుగను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం తెల్దేవరపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మంగళవారం దేవరకొండ ఆర్డీవో రమాణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు ఇండ్లను నిర్మించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపిడివో లక్ష్మి , ఎస్ఐ లోకేష్ పాల్గొన్నారు.



## నూతన ఎంపిడిఒగా యుగేందర్ రెడ్డి



**ప్రజాపక్షం /మునుగోడు:** మునుగోడు మండల నూతన ఎంపీడీవోగా యుగేందర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో గా పనిచేసిన శాంత కుమారి గత నాలుగు నెలల క్రితం పదవి విరమణ పొందగా సూపర్డెంట్ గా పనిచేస్తున్న భాస్కర్‌ను ఇంచార్జ్ ఎంపీడీవో గా ఇప్పటివరకు కొనసాగారు నూతనంగా ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ. మండల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతివారికి అందేలా కృషి చేస్తానని అన్నారు.

